నేడు 'డయల్‌ యువర్‌ డీఎం'

మేడ్చల్‌: మేడ్చల్‌ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 11న (నేడు) ×డయల్‌ యువర్‌ డీఎం₹ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం సుధాకర్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 9959226152 నంబర్‌కు కాల్‌ చేసి తమ సలహాలు, సూచనలు చేయవచ్చని పేర్కొన్నారు.

విద్యుత్‌ మీటర్ల పంపిణీ



కీసర: కీసరలోని డబుల్‌ బెడ్రూం లబ్ధిదారులకు మంజూరైన విద్యుత్‌ మీటర్లను కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు రామిడి విజయ్‌రెడ్డి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నేతలు ముద్దం వెంకట్‌, షాదీక్‌బాయ్‌ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్‌ పనుల పరిశీలన



బోర్‌వెల్‌ పనులను పరిశీలిస్తున్న మాజీ చైర్‌పర్సన్‌ పావని

పోచారం: పకీర్‌టెక్యాలో బోర్‌వెల్‌ పనులను మాజీ చైర్‌పర్సన్‌ ముల్లి పావనీ జంగయ్య యాదవ్‌ గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ బీ బ్లాక్‌ అధ్యక్షుడు వేముల మహేశ్‌ గౌడ్‌, మాజీ సర్పంచ్‌ రూప్‌సింగ్‌, నాయకులు మెరుగు నరేశ్‌, కిషన్‌ సింగ్‌, రాం సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

భిన్నమతాలకు నిలయంగా భారత రాజ్యాంగం

అల్వాల్‌: భిన్న మతాలకు నిలయంగా భారత రాజ్యాంగం అవతరించిందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మచ్చబొల్లారం కార్పొరేటర్‌ రాజ్‌జితేంద్రనాథ్‌ అన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌ తుర్కపల్లిలో 'జై భీమ్‌, జై బాపు, జై సంవిధాన్‌'కార్యక్రమంలో భాగంగా బాపు, అంబేడ్కర్‌, జగ్జీవన్‌రామ్‌ విగ్రహాలకు గురువారం పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతతత్వ బీజేపీ భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నాయని, కలిసికట్టుగా పోరాడి అంబేడ్కర్‌ అందించిన రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో ప్రజలకు అందేలా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ ఏ–బ్లాక్‌ అధ్యక్షుడు నిమ్మ అశోక్‌రెడ్డి, నాయకులు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, శేఖర్‌, ఉదయ్‌కుమార్‌, మధు, వెంకటేశ్‌, దేవేందర్‌, వివి.రావు, శకుంతల నాయుడు, కవిత, అరుణ, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్‌ ధరల పెంపును నిరసిస్తూ ధర్నా

మల్కాజిగిరి: సిలిండర్‌ ధరల పెంపును నిరసిస్తూ మల్కాజిగిరి సీపీఎం ఆధ్వర్యంలో మల్కాజిగిరి చౌరస్తాలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్‌ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కృపాసాగర్‌, విజయ్‌కుమార్‌, సరోజ, సూర్యకుమార్‌ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ హోమియో దినోత్సవం



హనీమన్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

రామంతాపూర్‌ : ప్రభుత్వ హోమియోపతి మెడికల్‌ కళాశాల బోధనాసుపత్రిలో గురువారం ప్రపంచ హోమియో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని హోమియో వైద్యం సృష్టికర్త డాక్టర్‌ హనీమన్‌ విగ్రహానికి కాళోజీ హెల్త్‌ యూనివర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి, ఆయుష్‌ డైరెక్టర్‌ హైమావతి, మాజీ కేంద్ర మంత్రి కె.వేణుగోపాలచారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆవరణ నుంచి హైదరాబాద్‌ పబ్లిక్‌ స్కూల్‌ వరకు హోమియో వాక్‌ నిర్వహించారు. అనంతరం ప్రముఖ హోమియో వైద్యులు రామంతాపూర్‌ ప్రభుత్వ హోమియో ఆసుపత్రి భవన నిర్మాణ దాత డాక్టర్‌ సోహన్‌సింగ్‌ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ ఆయుష్‌ అదనపు డైరెక్టర్‌ డాక్టర్‌ లింగరాజు, వైస్‌ ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో..

కీసరలో కనీస సౌకర్యాలు కరువు
- అధ్వానంగా డ్రైనేజీలు, కానరాని సీసీ రోడ్లు
- వెలగనీ వీధిదీపాలు, అస్తవ్యస్తంగా నీటి సరఫరా



కీసరలోని కృష్ణానగర్‌ కాలనీలో మట్టిరోడ్డు



సుభాష్‌నగర్‌ కాలనీలో వెలగని వీధిదీపం



సుభాష్‌నగర్‌ కాలనీలో ఓపెన్‌ డ్రైనేజీ దుస్థితి



భోగారం రహదారి పక్కన వేసిన వ్యర్థాలు

కీసర: మొన్నటివరకు మండలకేంద్రంగా మేజర్‌ గ్రామపంచాయతీగా, ప్రస్తుతం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో విలీనమైన కీసర అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. ఆయా కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, మరోవైపు అధ్వానంగా ఉన్న రహదారులు, ఇంకోవైపు వీధిదీపాలు వెలగకపోవడం, అస్తవ్యస్త తాగునీటి సరఫరాతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కీసర వ్యాపారకేంద్రంగా ఉండడంతో దుకాణ సముదాయాల నుంచి నిత్యం పెద్ద ఎత్తున చెత్తాచెదారం, మాసం దుకాణాల నుంచి వ్యర్థాలను పెద్ద ఎత్తున భోగారం–కీసర, కీసర–శామీర్‌పేట, ప్రధాన రహదారుల పక్కనే పడేస్తుండంతో రాకపోకలు సాగించేవారు దుర్వాసన భరించలేకపోతున్నారు. పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించకపోవడంతో పారిశుద్ధ్య పనులు అంతంతమాత్రంగానే చేపడుతున్నారు. ఇక పలు కాలనీల్లో రాత్రి వేళలో వీధిదీపాలు సరిగ్గా వెలగడం లేదు. కీసరలోని సుభాష్‌నగర్‌, 210 కాలనీ, 198 కాలనీ, రామలింగేశ్వర నగర్‌ కాలనీ, కృష్ణానగర్‌కాలనీ, వెంకటసాయి థియేటర్‌ కాలనీ తదితర కాలనీల్లో ఇప్పటికీ మట్టిరోడ్లే ఉన్నాయి. కాలనీలు ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా.. సీసీ రోడ్లు వేయడం లేదని కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక స్నేహకాలనీలోపాటు, శివాజీనగర్‌ తదితర కాలనీల్లో తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉంది. మున్సిపల్‌ ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ మంచి నీటి సరఫరా చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్‌ అధికారులు, పాలకులు స్పందించి కీసరలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

అధికారులు చొరవ చూపాలి..



కీసరలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు మున్సిపల్‌ అధికారులు చొరవ చూపాలి. కాలనీల్లో అంతర్గత డ్రైనేజీల నిర్మాణాలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు, వీధి దీపాలు సరిగా వెలిగేలా చర్యలు చేపట్టాలి.
– బండారి శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌నగర్‌ కాలనీ

సీసీరోడ్లు వేయాలి..



మా కాలనీలో ఇప్పటికీ మట్టి రోడ్డే దిక్కు. వర్షం వస్తే చాలు బురదమయంగా మారి నడిచేందుకు కూడా వీల్లేని పరిస్థితులు నెలకొంటున్నాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో రెండు మూడు సార్లు కాలనీ వాసులందరం కలిసి సొంతంగా డబ్బులు వెచ్చించి లారీల ద్వారా మట్టిని తెప్పించి రోడ్డు మధ్యలో గుంతలను పూడ్చి రాకపోకలు సాగిస్తున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.
– కాంసాని శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణానగర్‌ కాలనీ

అభివృద్ధి శూన్యం..



పెరిగిన జనాభా, కాలనీల పరంగా అభివృద్ధి చెందుతున్న కీసరలో ప్రజల అవసరాల మేరకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు విఫలమౌతున్నారు. ఎంతో చరిత్ర గల కీసరగుట్ట ఆలయం ఉన్న మా ప్రాంతం అభివృద్ధికి నోచుకోకపోవడం బాధకరం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు కీసరను బాగు చేయాలి.
– మిట్టపల్లి రాజు, కీసర నివాసి

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి

జవహర్‌నగర్‌: అంబేడ్కర్‌నగర్‌లో దోభీఘాట్‌కు మరమ్మతులు, షెడ్‌, రోడ్ల పనులు చేపట్టాలని కోరుతూ తెలంగాణ రజక రిజర్వేషన్‌ సమితి ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, ప్రధాన కార్యదర్శి కోలిపాక లక్ష్మణ్‌, ఉపాధ్యక్షుడు సాంబరాజు కుమార్‌, అధికార ప్రతినిధి ముత్యాల నర్సింగ్‌ రావు, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు శాగంతి వెంకటేశ్‌, కాప్రా మండలాధ్యక్షుడు పాలాస సాయికుమార్‌ ఉన్నారు.

నిరుపేదల కోసమే సన్న బియ్యం పంపిణీ

జవహర్‌నగర్‌: నిరుపేదల కోసమే కాంగ్రెస్‌ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నదని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్‌ అన్నారు. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని సన్న బియ్యం లబ్ధిదారుడు రమణయ్య ఇంటికి గురువారం వెళ్లి సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఎంఎ.రహీం, జవహర్‌నగర్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌, మాజీ మేయర్‌ శాంతికోటేష్‌, మాజీ డిప్యూటీ మేయర్‌ శ్రీనివాస్‌, మాజీ సర్పంచ్‌ శంకర్‌గౌడ్‌, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా రీజినల్‌ ట్రాన్స్‌పోర్ట్‌ అథారిటీ మెంబర్‌ భీమిడి జైపాల్‌ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న వజ్రేశ్‌యాదవ్‌, ఎంఎ.రహీం తదితరులు

సన్న బియ్యం పంపిణీతో నిరుపేదలకు మేలు



సహపంక్తి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్‌ తదితరులు

శామీర్‌పేట్‌: సన్న బియ్యం పంపిణీతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని మేడ్చల్‌ జిల్లా అదనపు కలెక్టర్‌ విజయేందర్‌ రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీలోని పౌరసరఫరాల శాఖ అధికారులు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్‌తో కలిసి ఆయన బాబాగూడలో ఓ దళితుడి ఇంట్లో గురువారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న బియ్యం పంపిణీని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకే అధికారులతో కలిసి పాల్గొంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌చార్జి సుగుణ బాయ్‌, శామీర్‌పేట తహసీల్దార్‌ యాదగిరిరెడ్డి, తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్‌ వెంకట వేణుగోపాల్‌, మేడ్చల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఏ బ్లాక్‌ అధ్యక్షుడు వేణుగోపాల్‌ రెడ్డి, ఆర్‌ఐ రాఘవ, కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు వైస్‌ గౌడ్‌, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌యాదవ్‌

మేడ్చల్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై నాయకులు, కార్యకర్తలు నిరంతరం పోరాటం చేయాలని మేడ్చల్‌ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్‌ భాస్కర్‌యాదవ్‌ అన్నారు. మేడ్చల్‌లో గురువారం నిర్వహించిన ఉమ్మడి మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 14న ఆలియాబాద్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సమావేశానికి బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ హాజరుకానున్నారని, నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. నాయకులు దయానంద్‌ యాదవ్‌, సుదర్శన్‌, రాజమల్లారెడ్డి, నవీన్‌రెడ్డి, హరత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరభద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం



పోతారం చౌరస్తా వద్ద రోడ్డుపై కూలిన చెట్టు

శామీర్‌పేట్‌: ఉమ్మడి శామీర్‌పేట మండలంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో మామిడి తోటలతో పాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సుమారు 3 గంటల పాటు విద్యుత్‌ సరఫరాకుత్‌ అంతరాయం కలిగింది.

విద్యుత్‌ అంతరాయం.

కీసర: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో గురువారం సాయంత్రం ఈదురుగాలులకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగిపడగా కీసర చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తెగిపడి విద్యుత్‌ లైన్ల మీద పడ్డాయి. ఈదురు గాలులకు మామిడి చెట్లకు ఉన్న కాయలు నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. కీసర చౌరస్తాలో విద్యుత్‌ లైన్లపై పడిన ఫ్లెక్సీలను విద్యుత్‌ సిబ్బంది తొలగించి విద్యుత్‌ సరఫరాను పునఃరుద్ధరించారు.



కీసరలో విద్యుత్‌ లైన్లపై పడిన ఫ్లెక్సీలు

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలో పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్‌. శ్రీనివాస్‌తో కలిసి పారిశుద్ధ్య కార్మికులు గురువారం మున్సిపల్‌ కమిషనర్‌ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. నెలనెలా తమకు జీతాలు వచ్చేలా చూడాలని విన్నవించారు. ఇచ్చిన వారిలో కృష్ణ, రాములమ్మ, కార్మికులు ఉన్నారు.

వల్లభ్‌నగర్‌లో స్లాట్‌ బుకింగ్‌ విధానం షురూ

అల్వాల్‌: వల్లభ్‌నగర్‌ సబ్‌ రిజిస్ట్రేషన్‌ కార్యాలయంలో స్లాట్‌బుకింగ్‌ విధానాన్ని డీఐజీ సైదిరెడ్డి గురువారం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ విధానం ద్వారా ప్రజలు తమకు అనుకూలమైన సమయంలో స్లాట్‌ బుక్‌ చేసుకోవచ్చు. రోజువారీగా 48 స్లాట్‌లుగా విభజించి రద్దీ నివారించేందుకు ఏర్పాటు చేశారు. అలాగే స్లాట్‌ బుకింగ్‌ చేయని వారికోసం సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వాక్‌ఇన్‌ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తారని అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్‌ ప్రక్రియను వేగవంతం చేసి అవినీతికి ఆస్కారం లేకుండా కేవలం 10, 15 నిమిషాల్లోనే పూర్తి చేసే లక్ష్యంతో స్లాట్‌ బుకింగ్‌ సిస్టం అందుబాటులోకి వచ్చిందని టీఎన్‌జీవో ప్రధాన కార్యదర్శి ముజీదుల్లా హుస్సేన్‌ (ముజీబ్‌) తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో అధ్యక్షుడు కృష్ణయాదవ్‌, వల్లభ్‌నగర్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ మదన్‌రాజ్‌ తదితరులు ఉన్నారు.

తప్పిన ప్రమాదం

మల్కాజిగిరి: మల్కాజిగిరి మారుతీనగర్‌లో గురువారం పెనూ ప్రమాదం తప్పింది. బిగ్‌సి షోరూం భవనాన్ని యజమాని మరమ్మతులు చేయిస్తున్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన గోవా (ఇనుప కడ్డీలతో) గురువారం సాయంత్రం వీచిన గాలులకు రోడ్డు మీద కూలిపోగా విద్యుత్‌ వైర్లు సైతం తెగిపడ్డాయి. అయితే ఆ సమయంలో రోడ్డు మీద ఎవరూ లేకపోవడంతో పెనూ ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారం మేరకు విద్యుత్‌ శాఖ అధికారులు కరెంట్‌ సరఫరా నిలిపివేశారు. ఈ ఘటనపై సంబంధిత ఏరియా ఏఈ గోపాల్‌ను వివరణ కోరగా యజమాని వివరాలు సేకరించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

కాప్రా: కమలానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేఎల్‌ మహేంద్ర స్టడీ సర్కిల్‌కు సీపీఐ సీనియర్‌ నేత వీఎస్‌ బోస్‌ గురువారం పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం స్టడీ మెటీరియల్స్‌ అందించామన్నారు. కార్యక్రమంలో కేఎల్‌ మహేంద్ర స్టడీ సర్కిల్‌ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, శంకర్‌ రావు, నారా నర్సింహ, రాఘవేంద్రరావు, సత్యప్రసాద్‌, పాల్గొన్నారు.

మన రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శం


- టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌
- జవహర్‌నగర్‌లో 'జై బాపు, జై భీమ్‌, జై సంవిధాన్‌' కార్యక్రమం



రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో వజ్రేశ్‌యాదవ్‌, శ్రీకాంత్‌యాదవ్‌ తదితరులు

జవహర్‌నగర్‌: ప్రజాస్వామ్య విలువలు, భిన్న మతాలకు అనుగుణంగా మన రాజ్యాంగం ఉండి ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచిందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌ యాదవ్‌ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు జవహర్‌నగర్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌ ఆధ్వర్యంలో 'జై బాపు, జై భీమ్‌, జై సంవిధాన్‌' కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫుడ్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ ఎంఏ ఫహీంతో కలిసి ఆయన మాట్లాడుతూ..మతతత్వ పార్టీలు భారత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్నాయని, కలిసికట్టుగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం జవహర్‌నగర్‌లో భారీ ర్యాలీ తీసి అంబేడ్కర్‌ విగ్రహం ఆవరణలో రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ కారింగుల శంకర్‌గౌడ్‌, మాజీ మేయర్‌ శాంతికోటేశ్‌గౌడ్‌, మాజీ డిప్యూటీ మేయర్‌ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌, మాజీ కార్పొరేటర్లు, మార్కెట్‌ కమిటీ సభ్యురాలు ఈగ శ్వేత, సీనియర్‌ నాయకులు సదానంద్‌, ఎర్రగుడ్ల వెంకటేశ్వర్‌, నాయకం భాస్కర్‌, వినయ్‌ కుమార్‌, యాదగిరియాదవ్‌, రమేశ్‌చారి బూడిద వెంకటేశ్‌, మిట్టు, రాజుయాదవ్‌, శంకర్‌, విజయ, మంజుల పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి

శామీర్‌పేట్‌: ట్రాఫిక్‌ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని మేడ్చల్‌ ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. జినోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్‌ పరిధి తుర్కపల్లిలోని బాలాజీ ఫంక్షన్‌ హాల్‌లో వాహనదారులతో పాటు గూడ్స్‌ వాహనాల డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి మొబైల్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయవద్దదన్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లావద్దని, అలాగే యూనిఫారం ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ సీఐ హనుమాన్‌గౌడ్‌, జినోమ్‌వ్యాలీ సీఐ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపుల రణభేరి చలో హైదరాబాద్‌ పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్నూరుకాపు సంఘం సభ్యులు

శామీర్‌పేట్‌: మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్‌ గ్రామంలో మున్నూరుకాపు సంఘం మండల కమిటీ అధ్యక్షుడు కటికం రాజు ఆధ్వర్యంలో మున్నూరుకాపుల రణభేరి చలో హైదరాబాద్‌ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర కన్వీనర్‌ ఉగ్గే శ్రీనివాస్‌ పటేల్‌ హాజరై మాట్లాడుతూ.. మున్నూరుకాపు సంఘం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఈనెల 13న హైదరాబాద్‌ ఇందిరాపార్క్‌ ధర్నా చౌక్‌ వద్ద నిర్వహించే రణభేరిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కమిటీ ఉపాధ్యక్షుడు జైహింద్‌, కోశాధికారి భాగయ్య, వెంకటేశ్‌, లక్ష్మాపూర్‌ సంఘం అధ్యక్షుడు దయానంద్‌, ప్రధాన కార్యదర్శి రవి, మాజీ అధ్యక్షుడు భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మౌలాలి: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మౌలాలి పీఎస్‌ఆర్‌ కాలనీలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వినోద, మల్కాజిగిరి మండల కార్యదర్శి మంగ మాట్లాడుతూ.. ఇటీవల మైనర్లపై తరచూ లైంగికదాడులు జరగడం దారుణమన్నారు. బాధిత మహిళా కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా ఉండాలని, ప్రభుత్వోద్యోగం, ఇల్లు మంజూరు చేయాలని, బాధిత చిన్నారికి ఉచితంగా ఉన్నత చదువులకు అవకాశం కల్పించాలని డిమాండ్‌ చేశారు. నరసమ్మ, అంజమ్మ, లక్ష్మి, ఫౌజియా పాల్గొన్నారు.